

టిడ్కో కాలనీలో పాఠశాలలు ఏర్పాటు చేస్తాం

సాక్షి ఎఫెక్ట్



కాలనీ లే–అవుట్‌ను పరిశీలిస్తున్న విద్యాశాఖాధికారులు

గుడివాడ టౌన్: టిడ్కో కాలనీలో విద్యార్థుల కోసం త్వరలోనే పాఠశాల ఏర్పాటు చేస్తామని మండల విద్యాశాఖాధికారులు ఐ.విజయ్, బాలాజీ తెలిపారు. టిడ్కో కాలనీలో పాఠశాలలు ఏర్పాటు చేయకపోవడంతో అక్కడి విద్యార్థులు పడుతున్న అవస్థలపై సాక్షి దినపత్రిక గత నెల 22వ తేదీన 'పాఠశాలలు ఏర్పాటు చేయరా?' అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. స్పందించిన అధికారులు మంగళవారం టిడ్కో కాలనీలోని ప్రభుత్వ స్థలాలు పరిశీలించారు. టిడ్కో ఉద్యోగుల వద్ద ఉన్న లే–అవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారులు మాట్లాడుతూ పట్టణంలోని వివిధ ప్రదేశాలకు చెందిన వారు ఇక్కడ కొత్తగా నివాసాలు ఉంటున్నారన్నారు. వీరి పిల్లలు పట్టణంలో వివిధ ప్రాంతాల్లో చదవడం వలన రోజూ పాఠశాలలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా విద్యాశాఖాధికారుల సూచనల మేరకు ఇక్కడ త్వరలో తాత్కాలిక పాఠశాల ఏర్పాటు చేస్తామని తెలిపారు. తదనంతరం పాఠశాల భవనాల నిర్మాణ పనులు చేపడతామన్నారు. ఇక్కడ పాఠశాలల ఏర్పాటుకు ప్రస్తుతం టిడ్కో కాలనీలోని ఖాళీ గృహాలలో అనువైన వాటిని పరిశీలించి మున్సిపల్ కమిషనర్ ద్వారా వాటిలో తాత్కాలిక తరగతుల నిర్వాహణకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు.



పింఛన్ల పంపిణీ

గుడివాడరూరల్: మండలంలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ విష్ణుప్రసాద్ తెలిపారు. మండలంలోని వలివర్తిపాడులో మంగళవారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: అర్హులందరికీ పింఛన్లు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో అబ్జర్వర్ గుండు శ్రీనివాసరావు, నాయకులు వల్లూరిపల్లి గణేష్, లక్ష్మీదాసు తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయుడి సేవలు ఆదర్శం



ఉత్తమ ఉపాధ్యాయుడు శివరామప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

ప్రాకర్ల(పామర్రు): రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన రాయన శివ రామ ప్రసాద్ సేవలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మండలంలోని ప్రాకర్ల గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో ఉత్తమ ఉపాధ్యాయుడ్ని మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ గొంతుపులి ఆనందమోహన్, పీసీ వైస్ ఛైర్మన్ వల్లూరిపల్లి గణేష్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రామును కలసిన మెడికల్ అధికారి

గుడివాడరూరల్: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి శర్మిష్ట ఎమ్మెల్యే వెనిగండ్ల రామును మర్యాదపూర్వకంగా మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో కలిశారు. గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాము సూచించారు.




పీఎం సూర్యఘర్ యోజనతో ప్రయోజనాలు



సూర్యఘర్ సోలార్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఇండియన్ బ్యాంక్ మేనేజర్ జ్యోతిప్రసాద్

మండవల్లి: పీఎం సూర్యఘర్ యోజన పథకం ద్వారా అనేక ప్రయోజనాలు సమకూరుతాయని స్థానిక ఇండియన్ బ్యాంక్ మేనేజర్ కె.జ్యోతిప్రసాద్, ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు పేర్కొన్నారు. భాస్కరరావు ఇంటిపై ఏర్పాటు చేసిన సూర్యఘర్ సోలార్ ప్లాంట్‌ను మంగళవారం మేనేజర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ మధ్య తరగతి వినియోగదారుల ప్రయోజనం కోసం ప్రధానమంత్రి తీసుకొచ్చిన సూర్యఘర్ పథకాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకుని లబ్ధి పొందొచ్చని పేర్కొన్నారు. దీని కోసం రూ.1.80 లక్షల రుణం పొందొచ్చని తెలిపారు. దీంట్లో రూ.78 వేలు సబ్సిడీ ఉంటుందని పేర్కొన్నారు.




పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



పసుపులేటి స్రవంతికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న యాజమాన్యం

పామర్రు: విద్యార్థులు తమ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడే అనారోగ్య సమస్యలు రావని ఏపీ నేషనల్ గ్రీన్ క్రాఫ్స్ స్టేట్ డైరెక్టర్ పసుపులేటి స్రవంతి పేర్కొన్నారు. స్థానిక యలమర్రు రోడ్డులోని ఏఎస్ఎం హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఒత్తిడి లేని విద్యా విధానం ఉత్తమమన్నారు. ప్రతి విద్యార్థి వ్యక్తిత్వ వికాసం పొందాలన్నారు. ప్రతి పాఠశాల్లో నూరుశాతం ఫలితాలు రావాలని తెలిపారు. అదేవిధంగా సేవ్ ఎనర్జీ, సేవ్ వాటర్, సే నో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్, ఎడాప్ట్ సస్టైనబుల్ ఫుడ్ సిస్టం, రెడ్యూస్ వేస్ట్, ఎడాప్ట్ హెల్తీ లైఫ్ స్టైల్, రెడ్యూస్ ఈ వేస్ట్ మొదలైన అంశాలను విద్యార్థులకు వివరించారు. తొలుత స్కూల్ యాజమాన్యం వారు ఆమెకు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అన్నపురెడ్డి పూర్ణ చంద్రారెడ్డి, ఎంఈఓ–2 పద్మవాణి, అర్జా ప్రసాద్, లంకపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.



బార్ అండ్ రెస్టారెంట్లపై ఎక్సైజ్ దాడులు

గుడివాడరూరల్: పట్టణంలోని బార్ అండ్ రెస్టారెంట్లపై ఎక్సైజ్‌శాఖ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ పి.వెంకటరమణ ఆధ్వర్యంలో ఎస్ఐ సుస్మిత, సిబ్బంది బార్లను తనిఖీ చేశారు. 24 గంటలు మద్యం విక్రయిస్తున్న బార్లపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా సమయ పాలన మించి విక్రయాలు చేపడుతున్న బార్లను గుర్తించి యజమానులపై కేసులు నమోదు చేశామన్నారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని విచ్చలవిడిగా మద్యం విక్రయాలు చేపడితే బార్లు, వైన్‌షాపులపై కేసులు పెడతామన్నారు.

పెరికెగూడెంలో నగర సంకీర్తన

మండవల్లి: శ్రీదత్త పరంపర సహిత షిర్డీ సాయిబాబా మందిరం ఆధ్వర్యంలో ధనుర్మాసం సందర్భంగా నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పాల్గొని భిక్ష స్వీకరించారు. గుడివాడ చిట్టిబాబు, యిన్నా వెంకటేశ్వరరావు, బండారు వెంకయ్య, పెరుమాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపు జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన

గుడివాడ టౌన్: జిల్లా స్థాయి ప్రభుత్వ పాఠశాలల వైజ్ఞానిక ప్రదర్శన గురువారం నిర్వహించనున్నట్లు డీవైఈఓ ఐ.పద్మరాణి తెలిపారు. స్థానిక కాకర్లవీధిలోని డీవైఈఓ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. స్థానిక మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో ఉదయం తొమ్మిది గంటలకు ఈ వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభమవుతుందన్నారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొంటారన్నారు. డీసీఈబీ కార్యదర్శి షేక్ జానీ సాహెబ్, ప్రదర్శన నిర్వహణ సభ్యురాలు జి. పద్మవాణి పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

పామర్రు: మద్యం తాగి అల్లర్లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని సీఐ వి.శుభాకర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అర్ధ రాత్రి రోడ్లపై నూతన సంవత్సర వేడుకలకు అనుమతులు లేవన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారికి రూ.1,000 జరిమానా, వాహనం సీజ్ చేస్తామని తెలిపారు.




























అప్రమత్తంగా ఉండాలి

గుడ్లవల్లేరు: బాలలపై జరిగే నేరాలపై అప్రమత్తంగా ఉండాలని గుడ్లవల్లేరు ఎస్‌ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. డోకిపర్రు ప్రభుత్వ హైస్కూల్లో ఆయన మంగళవారం విద్యార్థులకు బాలలపై జరిగే నేరాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగంపై జరిగే నష్టాలను ఆయన వివరించారు. సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. బాల బాలికలకు ఏవైనా అనుమానాస్పద ఘటనలు ఎదురైతే 112, 1930 ద్వారా సమాచారం అందించి సహాయం పొందవచ్చని తెలిపారు.





ప్రజలకు సేవలందించేందుకే సదస్సులు

గుడివాడరూరల్: ప్రజలకు సులువుగా సేవలందించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని శేరీవేల్పూరులో మంగళవారం సదస్సు నిర్వహించారు. బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కె.గోపాల్ అన్నారు. పుట్లచెరువు, పసలపూడి గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులకు రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించేందుకే ఈ సదస్సులను చేపట్టినట్లు తెలిపారు. పుట్లచెరువులో 11 అర్జీలు, పసలపూడిలో నాలుగు అర్జీలు పలు సమస్యలపై ప్రజలు అందజేశారు. ఆర్ఐ శ్రావణి, రీసర్వే డీటీ, వీఆర్ఓ శ్యామలరావు, పాల్గొన్నారు.



శేరీవేల్పూరు సదస్సులో పాల్గొన్న తహసీల్దార్

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: భూ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని తహసీల్దార్ బి.లోకరాజు పేర్కొన్నారు. మంగళవారం శేరీ కల్వపూడి సదస్సులో రైతుల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఎంఆర్ఐ పి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: గ్రామసభలను సద్వినియోగం చేసుకుని, భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ నవీన్‌కుమార్ తెలిపారు.



పుట్లచెరువులో నిర్వహించిన రెవెన్యూ సదస్సు

కూడేరు శివారు చెన్నూరివారిపాలెంలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సులో వివిధ సమస్యలపై తొమ్మిది దరఖాస్తులు అందజేశారు. రీసర్వే డీటీ యేసుపాదం పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: రెవెన్యూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జీఎస్ సుభానీ అన్నారు. మండలంలోని కాకరవాడ, దేవరం గ్రామాల్లో గ్రామసభలు మంగళవారం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

పామర్రు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎస్ఎంసీ కమిటీ సభ్యులు ఉపాధ్యాయులతో కలిసి కృషి చేయాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ శ్రీను నాయక్ పేర్కొన్నారు. స్థానిక ఎస్‌కే ఆర్ఆర్ జెడ్పీ హైస్కూల్లో ఎస్ఎంసీ సభ్యులకు ఒక్క రోజు శిక్షణ తరగతులను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలపై పూర్తి యాజమాన్యం వహించి నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. నూరు శాతం విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యేవిధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రిసోర్సు పర్సన్లు ధన్‌రాజ్, శాంతి అంకరవి, రాములు ఎస్ఎంసీలకు శిక్షణ ఇచ్చారు. సీఎంఓ టీఎస్ రమేష్, డీవైఈఓ పద్మరాణి, పామర్రు ఎంఈఓ–2 పద్మవాణి పాల్గొన్నారు.



ఎస్ఎంసీ సభ్యుల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న శ్రీను నాయక్

స్టేడియం క్రీడాకారుల ప్రతిభ

గుడివాడ టౌన్: రాష్ట్ర స్థాయి అంతర్ పాఠశాలల ఓపెన్ బాస్కెట్‌బాల్ పోటీల్లో తమ క్రీడాకారులు ప్రథమ స్థానం సాధించారని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్టేడియం కార్యాలయంలో విజేతలైన క్రీడాకారులను సత్కరించారు. విజేతలైన క్రీడాకారులను, కోచ్ జె. మల్లికార్జునరావును స్టేడియం కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి కె. రంగప్రసాద్ పాల్గొన్నారు.



బాస్కెట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలతో పాఠశాల యాజమాన్యం

గుడివాడ టౌన్: రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో తమ విద్యార్థులు బంగారు పతకం సాధించినట్లు మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ హెచ్ఎం జి. పద్మావతి అన్నారు. మంగళవారం పతకం సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించారు. చిత్తూరు జిల్లాలో జరిగిన బాస్కెట్‌బాల్ పోటీల్లో తమ విద్యార్థులు అబ్దుల్ రహమాన్, జ్యోతి గణేష్, శివ, ధనుష్, రాకేష్ విజయం సాధించారన్నారు. పాఠశాల ప్రెసిడెంట్ వి.లక్ష్మి, కరస్పాండెంట్ రమాదుర్గ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో నూతన సంవత్సర వేడుకలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. చిన్నకామనపూడి, వాడవల్లి ప్రాథమికోన్నత పాఠశాలల్లో రంగవల్లుల పోటీలు నిర్వహించారు.

2024 సంవత్సరానికి వీడ్కోలు



పూల దుకాణం వద్ద సందడి

కైకలూరు: మండల ప్రజలు పాత 2024 సంవత్సరానికి ఘనంగా వీడ్కోలు పలుకుతూ సందడి చేశారు. కైకలూరులో బేకరీ దుకాణాలు, స్వీట్లు, పండ్లు, పూల దుకాణాల వద్ద మోస్తరు కొనుగోళ్లు జరిగాయి. హోటళ్ల వద్ద రద్దీ కనిపించింది. ఆఫర్లతో పలువురు పలావు సెంటర్లను ఏర్పాటు చేశారు. మద్యం దుకాణాల వద్ద మందుబాబులు ఉత్సాహంగా కొనుగోళ్లు చేశారు. ఇదిలా ఉంటే నూతన ఏడాది శుభాకాంక్షలు తెలపడానికి విచ్చేసే అభిమానులు, కార్యకర్తల కోసం పార్టీల నాయకులు ఉదయం నుంచి అందుబాటులో ఉంటున్నారు.

రేడియం స్టిక్కర్ల ఏర్పాటు



కైకలూరు: రోడ్డు ప్రమాదాల నివారణకు కైకలూరు సర్కిల్ పరిధిలో 30 రేడియం డ్రమ్ములను ఏర్పాటు చేయించామని సర్కిల్ సీఐ వి.రవికుమార్ మంగళవారం తెలిపారు. రూరల్ పరిధిలో ప్రమాద ప్రాంతాలను గుర్తించామన్నారు. బెంగళూరు నుంచి ప్రత్యేకంగా రేడియం స్టిక్కర్లను తెప్పించి అతికించామన్నారు. సిబ్బందికి రేడియం జాకెట్లను పంపిణీ చేశామన్నారు.

సమాజంలో అందరూ సమానం

పామర్రు: సమాజంలో అందరూ సమానమని, ప్రతిరంగం వ్యక్తుల జీవనానికి అవసరమని పామర్రు ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. పామర్రు మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక శివరామ సినీ థియేటర్ ప్రాంగణంలోని ఎన్టీఆర్ స్టూడియో వద్ద నూతన సంవత్సర ఆహ్వాన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్‌ఐ కేక్‌ను కట్ చేసి అనంతరం మాట్లాడారు. మానవత అధ్యక్షుడు పామర్తి వెంకట నారాయణ, రీజియన్ చైర్మన్ పీఎంఎస్ ప్రసాద్, కన్వీనర్ త్రివిక్రమరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల ఫైనల్ జాబితా విడుదల

ముదినేపల్లి రూరల్: ఉమ్మడి కృష్ణా–గంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటర్ల ఫైనల్ జాబితాను విడుదల చేశారు. స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలతో పాటు పోలింగ్ జరిగే జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. నియోజకవర్గంలో 6,445మంది ఓటు హక్కు పొందారు.





























నూతన సంవత్సర సందడి

పమిడిముక్కల: మండలంలో నూతన సంవత్సర సందడి నెలకొంది. మంటాడ, వీరంకి లాకు, కృష్ణాపురం సెంటర్లో స్వీట్లు, కేక్‌లు, బిర్యానీ దుకాణాలు ఏర్పాటు చేశారు. దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడాయి. మహిళలు ఇంటి ముంగిట రంగవల్లులతో 2024కు వీడ్కోలు చెబుతూ 2025కు శుభాకాంక్షలు చెబుతూ ముగ్గులు తీర్చిదిద్దారు. ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఉత్సాహంగా గడిపారు.

పామర్రులో..

పామర్రు: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా పలు గ్రామాల్లో గృహిణులు తమ ఇళ్ల ముంది నూ తన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మంగళవారం రాత్రి రంగవల్లులను తీర్చిదిద్దారు. స్థానిక నెరుసు వారి బజారులో జాతీయ పక్షి నెమ లి ఆకృతిలో తీర్చి దిద్దిన ముగ్గులు ఆకట్టుకున్నా యి. పలు వీధుల్లో బిర్యానీ పాయింట్లు , స్వీట్ల్ దుకాణాలు, బేకరీలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘనలు జరగకుండా ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్ ముందస్తు చర్యలు తీసుకున్నారు.



పామర్రులో ఓ ఇంటి ముంగిట వేసిన నెమళ్ల ముగ్గు



గుడ్లవల్లేరులో కేకులను కొనుగోలు చేస్తున్న దృశ్యం



వీరంకిలాకు సెంటర్లో స్వీట్లు కొంటున్న ప్రజలు

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: వ్యాపారాల్లో నూతన సంవత్సర కళ మార్కెట్లో కనపడింది. కొత్త సంవత్సరానికి ఇంటి ముంగిళ్లలో కొత్త కళను తెచ్చే రంగవల్లులకు అద్దే రంగులను అమ్మేందుకు మంగళవారం గుడ్లవల్లేరు సెంటర్‌లో తోపుడుబళ్ల వర్తకులు రంగులను విక్రయించారు. కేకులు, బిర్యానీలు, బోకేలు, పండ్లు, స్వీట్లను కొనుగోలు చేసి తమ ఆప్తులు, బంధుమిత్రులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు మార్కెట్లో సందడి వాతావరణం నెలకొంది.













పర్యావరణ పరిరక్షణపై అవగాహన

గుడివాడ టౌన్: విద్యార్థులపై ఒత్తిడి లేని విద్య, వ్యక్తిత్వ వికాసం అవసరమని ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ క్రాప్స్ రాష్ట్ర డైరెక్టర్ పి.స్రవంతి అన్నారు. మంగళవారం స్థానిక వికాస్ రైన్‌బో హైస్కూల్, విద్యాలయ హైస్కూల్లో పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సేవ్ ఎనర్జి, సేవ్ వాటర్, సే నో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్, అడాప్ట్ సస్టైనబుల్ ఫుడ్ సిస్టమ్, రెడ్యూస్ వేస్ట్ తదితర అంశాలపై ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలల డైరెక్టర్లు పి.రామ చంద్ర శేఖర్, విద్యాలయ డైరెక్టర్ బొప్పన వెంకట భాస్కర్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న నేషనల్ గ్రీన్ క్రాప్స్ డైరెక్టర్ స్రవంతి

పాఠశాలల నిర్వహణపై అవగాహన అవసరం

గుడివాడ టౌన్: పాఠశాలల నిర్వహణపై అవగాహన ఉండాలని మండల విద్యాశాఖాధికారులు ఐ.విజయ్, డి.బాలాజీ అన్నారు. స్థానిక ఫాదర్ బియాంకి బాలికల ఉన్నత పాఠశాల్లో మంగళవారం గుడివాడ అర్బన్, రూరల్ మండలాలకు చెందిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, పాఠశాల కమిటీ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అనేక ప్రోత్సాహకాలు వస్తాయని, వాటి వివరాలు కమిటీ సభ్యులు తెలుసుకోవాలన్నారు. అదేవిధంగా విద్యాభివృద్ధిలో సైతం పాలక వర్గానికి అవగాహన ఉంటే మంచిదన్నారు. కార్యక్రమంలో ఫాదర్ బియాంకి బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం సిస్టర్ జయమ్మ, రీసోర్స్ పర్సన్లు దుర్గారావు, ఐ.అరవింద్, రామారావు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న విద్యాశాఖాధికారులు

కక్ష సాధింపు

నందివాడ: మండలంలోని లక్ష్మీనరసింహాపురంలో ఆర్ఓ ప్లాంట్ నిర్వహిస్తున్న తనపై అధికార పార్టీ నాయకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు చింతాడ ఓగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆర్ఓ ప్లాంట్‌కు సంబంధించి అన్ని పర్మిషన్లు ఉన్నా సరే.. ప్లాంట్ మూసి వేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై గ్రామస్తులు స్పందిస్తూ సుమారు వెయ్యి మంది ఈ వాటర్ ప్లాంట్ పై ఆధారపడి ఉన్నామని తెలిపారు. ఈ ప్లాంట్ ఉండడంతో తాగునీటికి తమకు ఎటువంటి కొరత లేని శుద్ధమైన నీరు అందిస్తున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఓగేశ్వరరావు

గడ్డి వాముల దగ్ధం



కైకలూరు: ఏడాది చివరి రోజున మండలంలో రెండు గ్రామాల్లో వరిగడ్డి వాములు దగ్ధమయ్యాయి. ఫైర్ ఆఫీసర్ క్రాంతికుమార్ కథనం మేరకు కైకలూరు మండలం ఆచవరం గ్రామానికి చెందిన మాడపాటి వీరరాజుకు చెందిన రెండెకరాలు, అదేవిధంగా పల్లెవాడ గ్రామానికి చెందిన వేల్పూరి రాంబాబుకు చెందిన ఆరెకరాల గడ్డి వాములు మంగళవారం దగ్ధమయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి పడేసిన సిగిరెట్ వల్ల ప్రమాదం జరిగి ఉండొచ్చని భావిస్తున్నట్లు ఫైర్ ఆఫీసర్ తెలిపారు. రూ.30 వేలు నష్టం వాటిల్లిందని అంచనా వేశామన్నారు. సహాయ కార్యక్రమాల్లో ఫైర్ సిబ్బంది పరుశురాముడు, శ్రీనివాసరావు, సూర్యం పాల్గొన్నారు.

ముగిసిన వర్కు షాపు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాల్లో ఈసీఈ విభాగం ఆధ్వర్యాన గత ఐదు రోజులుగా జరుగుతున్న 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్' వర్కు షాపు మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఈసీఈ విభాగాధిపతి శ్రీ గౌరి మాట్లాడుతూ ఐవోటీ ఇంటర్‌షిప్ చేయడం, డివైజ్ కోడింగ్ నేర్చుకోవడం ద్వారా మంచి వేతనాలతో ఉద్యోగాలు సాధించగలరన్నారు. రిసోర్స్‌పర్సన్, శాస్త్రవేత్త మురుగన్ ఐవోటీ, ఐవోటీ డివైజ్ ప్రోగ్రామింగ్, వైర్‌లెస్ ఇంటర్‌ఫేస్ వంటి అంశాలపై అవగాహన పరిచారు. ప్రిన్సిపాల్ ఎం. ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ ఐవోటీ ఉపయోగించి ఫైనల్ ఇయర్ విద్యార్థులు ప్రాజెక్టులు చేయడం ద్వారా ఉన్నత ఉద్యోగాలకు కావాల్సిన జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని పెంపొందించుకోగలరని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యాన్ష్ ఠాకరే, కళాశాల సెక్రటరి శ్రీ కృష్ణ, టీపీవో శివనాగేశ్వరరావు, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



• సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి పూజలు చేశారు.



